క్లుప్తంగా

ప్రహరీకి శంకుస్థాపన

దమ్మపేట: మండల కేంద్రం, దమ్మపేటలో రూ.6 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఖబ్రస్తాన్ ప్రహరీ గోడ నిర్మాణానికి, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతులమీదుగా గురువారం శంకు స్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. విద్య, ఉపాధి తదితర అంశాల్లో ముస్లింలకు ప్రత్యేక రిజర్వేజన్లు కల్పించింది, కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. దమ్మపేటలో శిథిలావస్థలో ఉన్న షాదీఖానా భవనమును తొలగించి, దాని స్థానంలో నూతన భవన నిర్మాణమును త్వరలోనే చేపడతామని ప్రకటించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు దస్తగీర్, గోరే, వలీపాషా, ఫయాజ్, వసీమ్ కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, చిట్టిబాబు, మల్లేశ్వరరావు, గోపిశాస్త్రి, రొయ్యల కుమార్, గోపి, రాంబాబు, కొయ్యల ప్రసాద్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ర్యాలీ



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నినాదాలు చేస్తున్న నాయకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో గురువారం యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. బుధవారం గాంధీభవన్‌లో జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులపై జరిగిన దాడికి నిరసనగా భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. దళిత యువజన నాయకుడుపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేస్తూ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. బాధితులకు తెలంగాణ రాష్ట్ర అటవీ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య అండగా నిలిచారని పలువురు అన్నారు. తగు చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలి

చర్ల: ఈ నెల 26న దేశవ్యాప్తంగా జరిగే భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని మాలమహానాడు జిల్లా కన్వీనర్ తోటమళ్ల రమణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని మాలమహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ సారి స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అంబేడ్కర్ చిత్రపటాలను ఏర్పాటు చేయకుండా పాలకులు, అధికారులు అవమానిస్తున్నారని ఆయన అన్నారు. ఇక నుంచి ప్రతీ వేడుకలోనూ ఆయన చిత్రపటాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కో కన్వీనర్ ఎడెల్ల గణపతి, సీనియర్ నాయకులు తడికల లాలయ్య, కొంగూరు రమణారావు, మండల గౌరవ అధ్యక్షుడు మోతుకూరి ప్రభాకర్, మండల అధ్యక్షుడు తోటమళ్ల గోపాలరావు, నాయకులు బోళ్ల వినోద్, తోటమళ్ల కృష్ణారావు, కొంగూరు సత్యనారాయణ, తోటమళ్ల రవికుమార్, పాముల సాంబశివరావు పాల్గొన్నారు.

జీఓ 64 నిలిపివేయాలి

భద్రాచలంఅర్బన్: డైలీ వేజ్, కాంటినెంట్, పార్ట్ టైం వర్కర్లకు వేతనాలు నిర్ణయిస్తూ 2021లో బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 64 అమలును నిలిపివేయాలని, ఇప్పుడు చెల్లిస్తున్న విధంగానే జిల్లా కలెక్టర్ కనీస వేతనాల సర్కులర్ ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్, గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్స్ డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి డిమాండ్ చేశారు. గురువారం భద్రాచలం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచవలసిన ప్రభుత్వం.. జీఓ నంబర్ 64ను అమలు చేయాలని చూడడం గిరిజన కార్మికులకు ద్రోహం చేయటమే అవుతుందన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్ అధ్యక్ష వహించగా నాయకులు పాయం ముత్తయ్య, మంగమ్మ, కౌసల్య, ముసలయ్య, పాపారావు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

భద్రాచలంఅర్బన్: ఉపాధి హామీ పనులతో సంబంధం లేకుండా వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని, ఇంటి స్థలం లేనివారికి స్థలం కేటాయించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని గురువారం జరిగిన గ్రామసభలో సీపీఎం పార్టీ పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. భద్రాచలం పట్టణంలో జరిగిన ప్రజా పాలన గ్రామసభలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధికారులను, స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకటరావును ఈ అంశాలపై సమాధానం చెప్పాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి.సీతాలక్ష్మి, పట్టణ కమిటీ సభ్యులు ఏ.రత్నం, ఫిరోజ్ పాల్గొన్నారు.

వాడీవేడిగా ముగిసిన గ్రామసభలు

- చివరిరోజూ జాబితాపై స్థానికుల అసంతృప్తి
- పలుచోట్ల కొనసాగిన నిలదీతలు, ఆందోళనలు



ములకలపల్లి: అధికారులతో స్థానికుల వాగ్వాదం..



గుండాల: ఆళ్లపల్లిలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు



దమ్మపేట: గ్రామసభలో అధికారులతో వాగ్వాదానికి దిగిన స్థానికులు

పినపాక: మండల పరిధిలోని జానంపేట గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా జరిగింది. మొదట గ్రామ సభకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఎమ్మెల్యే వెళ్లిన వెంటనే గ్రామ సభలో అర్హుల జాబితా అని అధికారులు చదివి వినిపించారు. అనంతరం గ్రామసభలో గ్రామస్తులంతా అధికారులపై తిరగబడ్డారు. అర్హుల జాబితాలో నిజమైన అర్హుల పేర్లు తొలగించారని అధికారులపై మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరస్పరం వాగ్వాదంతో గ్రామసభను రాజకీయ పార్టీల వేదికగా మార్చారు.

ములకలపల్లి: ములకలపల్లి జీపీ గ్రామసభను ఎంపీడీఓ రేవతి అధ్యక్షతన స్థానిక రైతువేదికలో ఏర్పాటు చేశారు. లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించగా.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో లోపాలు ఉన్నాయంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోమారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సూచించగా.. ఎన్నిసార్లు వినతిపత్రాలు సమర్పించాలని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారుల తీరును నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో రైతువేదిక ఎదుట ధర్నా చేపట్టారు. వీరికి టీఆర్ఎస్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఎంపీడీఓ రేవతి, సీఐ వినయ్‌కుమార్ హామీ మేరకు ఆందోళన విరమించారు. డీటీ భాగ్యలక్ష్మి, ఏఎస్ఓ దుర్గారావు, ఏఈఓ మనోహర్, జీపీ కార్యదర్శి రవి, సీపీఐ జిల్లా నాయకుడు నరాటి ప్రసాద్, నరాటి రమేష్, గంటా రాఘవులు, టీఆర్ఎస్ నాయకులు పుష్పాల చందర్‌రావు, శనగపాటి సీతారాములు, బండి కొమరయ్య, పుష్పాల సాయి తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: అర్హులైనప్పటికీ తమ పేర్లు సంక్షేమ పథకాల్లో ఎందుకు రాలేదని నిరసనకారుల ఆందోళనతో మండలకేంద్రం చంద్రుగొండలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభ దద్దరిల్లింది. ఈ క్రమంలో బీఆర్ఎస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు గొంతుకలపడంతో సభలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మరోవైపు కాంగ్రెస్ శ్రేణులు, బీఆర్ఎస్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేశారు. పోకలగూడెం, రావికంపాడు, తిప్పనపల్లి గ్రామాల్లో జరిగిన సభలు ఆందోళనల మధ్య సాగాయి. అర్హులైన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు పదేపదే విజ్ఞప్తి చేశారు. ఈ సభల్లో ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఎంపీఓ ఖాన్, నాయకులు కొడకండ్ల వెంకటరెడ్డి, భోజ్యానాయక్, కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండలంలోని పెద్దగొల్లగూడెం, మందలపల్లి, రాచూరుపల్లి, సభల్లో అర్హులకు లబ్ధిదారుల జాబితాలో చోటు దక్కలేదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. దమ్మపేటలో పెద్ద పెద్ద భవంతులు, ఆస్తులు ఉన్న వ్యక్తుల పేర్లు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ఉండగా.. అర్హత గల పేదల పేర్లు జాబితాలో లేకపోవడంపై అధికారులతో స్థానికులు తీవ్ర వాగ్వివాదానికి దిగారు. సభాస్థలికి చేరుకున్న ఎస్సై సాయికిషోర్ రెడ్డి ఆందోళన పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కాంగ్రెస్ నాయకులు విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వాణి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: స్థానిక గ్రామ పంచాయతీలో నిర్వహించిన సభలో అర్హుల జాబితాలో అనర్హులకు పెద్ద పీట వేశారని పలువురు గ్రామస్తులు, విపక్ష పార్టీల నాయకులు అధికారులను నిలదీశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. జాబితాలో పేర్లు రానివారు మరలాదరఖాస్తులు అధికారులకు సమర్పించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుసేన్,మాజీ సర్పంచులు తోలెం నాగేశ్వరరావు, పోలెబోయిన శ్రీవాణి,నాయకులు ఎర్ర సురేష్, జలగం కృష్ణ,పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట: అశ్వారావుపేట మండల పరిధిలోని పేరాయిగూడెం గ్రామపంచాయతీలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాల లబ్ధిదారుల జాబితాలో అర్హులైన వారి పేర్లు లేకపోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇళ్లు, రేషన్ కార్డులు ఉన్న వారి పేర్లే జాబితాలో వచ్చాయని అధికారులను నిలదీశారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగిన జాబితా పేర్లు చదువుతుండగానే.. వారికి అన్నీ ఉన్నాయంటూ పెద్ద ఎత్తున కేకలు వేయశాగారు. జాబితాలో పేర్లు నమోదు కాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే అర్హులకు పథకాలు అందుతాయని తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ హామీ ఇచ్చారు.

భద్రాచలంఅర్బన్: గ్రామ సభ వద్ద గురువారం బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ భద్రాచలం మండల పార్టీ కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వాగ్దానాలకు కట్టుబడి ప్రజలకు పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ కోకన్వీనర్ రేపాక పూర్ణచందర్‌రావు, మండల నాయకులు కోలారాజు, ఏడుకొండలు, బత్తుల నర్సింహులు, కాపుల సూరిబాబు, నాగరాజు, నాగేశ్వరరావు, అమరాల డానియల్ ప్రదీప్,రావూరి రవికిరణ్, ప్రకాష్, కావూరి సీతామహాలక్ష్మి, పూజల లక్ష్మి, ప్రియాంక పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని పలు పంచాయతీల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. అర్హులైనప్పటికీ తమ పేరు రాలేదని ప్రజలు సభల దృష్టికి తీసుకునివచ్చారు. చిన్న చిన్న ఘటనలు తప్ప గ్రామ సభలు ప్రశాంతంగా ముగిశాయి. 37 పంచాయతీలలో 36 పంచాయతీలలో గ్రామ సభలు పూర్తి కాగా గౌరారం పంచాయతీలో నేడు గ్రామ సభ నిర్వహించనున్నారు. ఈ గ్రామ సభల్లో తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీఓ రామకృష్ణ, ఏఓ నవీన్‌కుమార్, ఏపీఓ సుకన్య, ఆర్ఐలు కల్లూరి వెంకటేశ్వరరావు, నరసింహారావు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుండాల: ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా పథకాల్లో అర్హులను ఎంపిక చేయలేదని మళ్లీ రీసర్వే చేయాలంటూ గ్రామ సభల్లో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆళ్లపల్లి గ్రామ సభలో నాయకులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఆళ్లపల్లి మండల కేంద్రంలో సీపీఐ నాయకులు, స్థానికులు ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా ఎంపికలో తప్పుల సర్వే జరిగిందంటూ ఆందోళనకు దిగారు. రీ సర్వే చేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు నాయకుల మధ్య తోపులాట జరిగింది. సీపీఐ జిల్లా నాయకులు రేసు ఎల్లయ్య కిందపడ్డాడు. దీంతో పోలీసుల తీరుపై స్థానికులు మండిపడ్డారు. ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. గుండాలలో అబ్ధిదారుల వివరాలను వెల్లడించాలని నోటీస్ బోర్డులపై అంటించాలని డిమాండ్ చేశారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం, గొల్లగూడెం, గొందిగూడెం, జగ్గారం, తుమ్మలచెరువు, రామచంద్రాపురం, మొండికుంట, అశ్వాపురం గ్రామ పంచాయతీల్లో గురువారం ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. అధికారులు సంక్షేమ పథకాల అర్హుల జాబితాను చదివి వినిపించారు. అర్హతలు ఉన్నా సంక్షేమ పథకాల అర్హుల జాబితాలో పేర్లు లేవని ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రసాభాసగా సాగిన ఈ సభలో తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ వరప్రసాద్, ఏఓ సాయిశంకర్, సీడీపీఓ రేవతి, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, సిబ్బందితోపాఉట పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.



పినపాక: జానంపేట గ్రామసభలో ప్రజల అభ్యంతరాలను వింటున్న అధికారులు



భద్రాచలంఅర్బన్: గ్రామసభ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



అశ్వారావుపేట: అధికారులను నిలదీస్తున్న పేరాయిగూడెం ప్రజలు

కంటతడి పెట్టిన కార్యదర్శి



అశ్వారావుపేటరూరల్: గ్రామసభలో కార్యదర్శిని నిలదీస్తున్న స్థానికులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామ పంచాయతీలో గురువారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలో అర్హుల పేర్లు రాలేదని లబ్ధిదారులు, బీఆర్ఎస్ కార్యకర్తలు అధికారులను నిలదీశారు. పంచాయతీ పరిధిలో అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధువుల పేర్లే ఎంపిక చేశారని స్థానికులు పంచాయతీ కార్యదర్శి బి.మహేశ్వరిని నిలదీశారు. అధికార పార్టీ వాళ్లకే రెండు నుంచి మూడు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఏ విధంగా ఎంపిక చేశారని ఆగ్రహం వ్యక్తం చేయడంతో కార్యదర్శి కన్నీటి పర్యాంతం అయ్యారు. దీంతో గ్రామసభలో కొద్ది సేపు ఉద్రిక్తత నెలకొంది. అక్కడే ఉన్న ఎస్సై శ్రీరామ్మూర్తి సర్దిచెప్పి శాంతింపజేశారు.

ఎమ్మెల్యే కృషితోనే బీటీ రోడ్లు

అశ్వాపురం: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషితో మండలంలో బీటీ రోడ్లు మంజూరయ్యాయని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ అన్నారు. మండలంలో మంజూరైన బీటీ రోడ్లను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం పరిశీలించి శిలాఫలకాల నిర్మాణాలకు స్థలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో సంద్రలబోడు నుండి అమెర్ద వరకు రూ.2 కోట్లు, కుర్నం వారిగూడెం నుంచి జగ్గారం వరకు రూ.1.90 కోట్లతో బీటీ రోడ్లు మంజూరయ్యాయన్నారు. రహదారుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తెల్లం వీరభద్రం, కిలారి శేషగిరిరావు, మేకల అంజిబాబు, కొర్సా కృష్ణ, పునీశ్వరరావు, నాగేశ్వరరావు, అప్పారావు, సమ్మయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏరియా జీఎం, సేవా సమితి అధ్యక్షురాలు

మణుగూరుటౌన్: యాజమాన్యం ఆయా గనుల ప్రాంతాల మహిళలకు, నిరుద్యోగ యువతకు ఏటా లక్షలాది రూపాయలు వెచ్చిస్తూ కల్పిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. గురువారం మండలంలోని తిర్లాపురం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తిర్లాపురంలో ఉచిత వైద్యశిబిరాలతో పాటు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించి కంటి చికిత్సలు నిర్వహించి కళ్లద్దాలు పంపిణీ చేశామని అన్నారు.

ఏరియా సేవా అధ్యక్షురాలు దుర్గం సుమతి రాంచందర్ మాట్లాడుతూ.. మహిళలు చేతి వృత్తులు అదనపు అర్హతలుగా ఉంటాయన్నారు. అనంతరం సీఎస్ఆర్‌లో భాగంగా ఫర్నీచర్ కేటాయింపుతో పాటు ఓసీ–2లో 15 మందికి ఉపాధి కల్పించడం పట్ల గ్రామస్తులు అధికారులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏరియా జీఎం అధికారులు కలిసి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస చారి, సలగల రమేశ్, బి.వెంకటేశ్వర్లు, భాస్కరరావు, అవినాష్, బాబుల్ రాజ్, శ్రీనివాస్, సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్, ప్రవీణ్, సింగు శ్రీనివాస్, శ్వేత, షాకీరా, బాలరాజు, సీతారాములు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న భద్రాచలం ఎంవీఐ వెంకట పుల్లయ్య

భద్రాచలంఅర్బన్: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా, రవాణా శాఖ భద్రాచలం యూనిట్ కార్యాలయం ఆవరణలో గురువారం వాహనదారులు, డ్రైవర్లు, లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చిన దరఖాస్తుదారులకు మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని, డ్రైవింగ్ సమయంలో ఓపిక లేకపోవడం లేదా చిన్న పాటి పొరపాటు ఇతరుల ప్రాణాలకు గణనీయమైన ముప్పుగా మారుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారించడంలో తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన సూత్రాలు సులభమైన పద్ధతిలో వివరించారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి

పినపాక: ప్రభుత్వం అందించే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్క అర్హుదారుడికి అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం మండల పరిధిలోని ఈ బయ్యారం, జానంపేటలో నిర్వహించిన గ్రామసభల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. నూతన పథకాల అర్హుల జాబితాలో పేర్లు రానివారు గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏడీఏ తాతారావు తహల్దార్ నరేష్, సీఐ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


కరకగూడెం: ప్రజా పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతున్నదని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మండల పరిధిలోని భట్టుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. పాలనలో జవాబుదారీతనం, పారదర్శకతను పెంచడం కోసమే ఈ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

లబ్ధిదారుల ఎంపికలో నిర్లక్ష్యం వద్దు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): లబ్ధిదారుల ఎంపికలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హెచ్చరించారు. మండలంలోని పెద్దిరెడ్డిగూడెం, పెంట్లం, అన్నపురెడ్డిపల్లి గ్రామాల్లో గురువారం జరిగిన ప్రజాపాలన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. తొలిజాబితాలో పేర్లులేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అన్నపురెడ్డిపల్లిలో అనర్హుల పేర్లు జాబితాలో ఉన్నాయని కొందరు ఎమ్మెల్యే ఎదుట ఆందోళనకు దిగారు. జాబితాను ప్రక్షాళన చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నిరసనకారులను పోలీసులు శాంతింపజేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో తహసీల్దార్ జగదీశ్వరప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి, నాయకులు వనమా గాంధీ, పర్సా వెంకట్, వేముల రమణ పాల్గొన్నారు.



కరకగూడెం: గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



అన్నపురెడ్డిపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

నూతన కమిటీలకు అభినందన

దమ్మపేట: నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖల కమిటీలను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అభినందించారు. గురువారం మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జారేను, గ్రామ శాఖలకు నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, వారికి అభినందనలు తెలిపి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో దమ్మపేట గ్రామ శాఖ అధ్యక్షుడు చిన్నశెట్టి చిట్టిబాబు, గండుగులపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు తలుపుల శ్రీను, కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, అత్తులూరి వెంకటరామారావు, తుమ్మల శేషబాబు, ఎర్రా వసంతరావు, రొయ్యల కుమార్, కొయ్యల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే పథకాలు అందించాలి

మణుగూరుటౌన్: ఉపాధి హామీ పనులతో సంబంధం లేకుండా వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని ఇంటి స్థలం లేని వారికి స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం పార్టీ మండల కమిటీ గురువారం డిమాండ్ చేసింది. సమితిసింగారంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు అధికారులను, స్థానిక అంశాలపై సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గ్రామాల్లోని వ్యవకూలీలుగా ఉన్న పేదలకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, కొడిశాల రాములు, ముత్యాలు పాల్గొన్నారు.

సహస్ర ఘటాభిషేకం

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని షిరిడీ సాయి బాబా మందిరంలో గురువారం బాబుకు సహస్ర ఘటాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్యనారాయణ పూర్తి కోశాధికారి కుంచాల రమేష్, సభ్యులు గొర్ల వెంకటేశ్వరావు నేతృత్వంలో గోదావరి నుంచి 11 బిందెలతో జలాలు తీసుకువచ్చి బాబాకు అభిషేకం చేశారు. అనంతరం 108 బిందెలతో సహస్ర ఘటాభిషేకాన్ని నిర్వహించారు. తెల్లం భీమయ్య ముత్తమ్మ కుమార్తె సరోజిని రూ.20 వేలు అన్నదానానికి వితరణ చేయగా.. సుమారు 800 మంది భక్తులు వారి ఆర్థిక సాయంతో అన్నదానం నిర్వహించారు.

నేతాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి




భద్రాచలంఅర్బన్: సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

భద్రాచలంఅర్బన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోరాటాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని భద్రాచలం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి సోమశేఖర్ అన్నారు. గురువారం సుభాష్ చంద్రబోస్ 128వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని తాతగుడి సెంటర్‌లోని ఆయన విగ్రహానికి భద్రాచలం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం పోరాటం, ప్రాణత్యాగం చేసిన మహనీయులే నిజమైన హీరోలని అన్నారు. కార్యక్రమంలో భద్రాచలం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి చల్లగుళ్ల నాగేశ్వర రావు, సభ్యులు జోగారావు, రాంప్రసాద్, జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, శోభన్‌బాబు, మురళిమోహన్, సానికొమ్ము చైతన్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెదవాగు ప్రాజెక్టు గ్రామంలోగల తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల(దమ్మపేట)లో స్వాతంత్ర సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.సింధుశ్రీ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినిలకు స్వాతంత్ర్యోద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన పోరాటాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది ఎస్ సుఫియన్, అరుణ, భవాని, సుధారాణి, ఉమా, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా గ్రామసభల నిర్వహణ



మణుగూరుటౌన్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, నాయకులు

మణుగూరుటౌన్: పంచాయతీ ఎన్నికలకు తాయిలాలుగా ప్రజలను మభ్యపెట్టేందుకు మొక్కుబడిగా గ్రామసభలు నిర్వహిస్తున్నారని వార్డుకు రెండు గంటలు కేటాయిస్తూ కనీసం గ్రామసభలో అధికారులు ప్రజల సమస్యలు వినే పరిస్థితి లేదని బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్‌లు ఆరోపించారు. గురువారం స్థానిక బీఆర్ఎస్ పట్టణ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో జరిగే గ్రామసభల్లో అధికారులు చదవాల్సింది చదివి వెళ్లిపోతున్నారు తప్ప ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానాలు అధికారుల వద్ద లేకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ స్వయం కృతాపరాదం చేసి ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుంటూ బీఆర్ఎస్‌పై బురదజల్లే పని చేస్తోందని విమర్శించారు. గ్రామసభల అనంతరం లబ్ధిదారుల లిస్ట్ తీసుకుని ఎవరికి ఎందుకు ఎలా కేటాయించారో బీఆర్ఎస్ క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం భవిష్యత్ కార్యాచరణ చేపడతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు బొలిశెట్టి నవీన్, నూకారపు రమేష్, వట్టం రాంబాబు, ముద్దంగుల కృష్ణ, ఎడ్లశ్రీను, జావీద్‌పాషా, గుర్రం సృజన్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ వర్తింపజేయాలి

పినపాక: కాంగ్రెస్ పార్టీ ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు గ్రామాల్లో సభలు పెడుతున్నారని, అర్హులైన ప్రజలందరికీ అన్ని పథకాలు అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ పినపాక మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. దరఖాస్తులు తీసుకున్న అందరి పేర్లు చదువుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. జనవరి 26వ తేదీన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపిక చేసిన లిస్ట్ విడుదల చేసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. కేవలం కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే పథకాలు ఇచ్చేందుకు తెరవెనుక మంతనాలు చేస్తున్నారని ఆరోపించారు. అర్హులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.